క్లుప్తంగా

రెండవ అదనపు జిల్లా కోర్టు ఏజీపీగా రేణుకాదేవి


రేణుకాదేవి

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ రెండవ అదనపు జిల్లా న్యాయస్థానానికి అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా స్థానిక న్యాయవాది శ్రీనివాసుల రేణుకా దేవిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆమె సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా ఉన్నారు. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంతవరకు రెండవ అదనపు జిల్లా న్యాయస్థానానికి కూడా ఆమె ఏజీపీగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆమె నియామకం పట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రాంరెడ్డి, న్యాయవాదులు నారపరాజు శ్రీనివాసరావు, కాల్వ శ్రీనివాసరావు, జక్కుల నాగేశ్వరరావు, ఎస్.సత్యనారాయణ, ఏ. శ్రీనివాస్ రెడ్డి, కె.బాలకృష్ణ, బి.నరేష్, పి.వీరు, ఎం.గోపినాథ్, జి.ప్రశాంత్, ప్రదీప్తి, శ్రీలక్ష్మి, రమాదేవి, దీపిక, సంధ్య తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మార్సీ కార్యాలయం తనిఖీ


ఎమ్మార్సీ కార్యాలయంలో జిల్లా సెక్టోరియల్ అధికారి, తదితరులు

నడిగూడెం : మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయాన్ని గురువారం విద్యాశాఖ జిల్లా సెక్టోరియల్ అధికారి శ్రావణ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో డ్రాప్ బాక్స్, ఫిజికల్ వెరిఫికేషన్ ఫామ్, పలు రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. ముందస్తు బడిబాట కార్యక్రమంపై ఆరా తీశారు. ఆయన వెంట సీఆర్‌పీలు నందిగామ రామారావు, గురుస్వామి, గోవర్ధన్, నాగరాజు, రాజశేఖర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోదాడరూరల్ : మండల పరిధిలోని రెడ్లకుంటలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న కంప చెట్లు, చెట్ల కొమ్మలను తొలగించేందుకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ రూరల్ ఏఈ ఎస్‌కె.సైదా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

కొత్తగూడెం, మంగలితండా గ్రామాల్లో..

అనంతగిరి : మండలంలోని గోండ్రియాల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కొత్తగూడెం 11కేవీ ఫీడర్‌కు అంతరాయంగా ఉన్న కంప చెట్లను తొలగించనున్నందున కొత్తగూడెం, మంగలితండా గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ సీతారాం గురువారం ఒక ప్రకటనలో తలిపారు.

సాయిమందిరంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న దాతలు

మునగాల : మండల కేంద్రం శివారులోని శ్రీహరిహరసుత అయ్యప్ప ఆలయం ఆవరణలో గల శ్రీషిర్డీ సాయి మందిరంలో గురువారం మండల కేంద్రానికి చెందిన మండలపు సాంబయ్య -సంధ్య దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సాయిమందిరం నిర్వాహకుడు దేవినేని రవికుమార్ మాట్లాడుతూ.. సాయి మందిరంలో దుని నిర్మాణం చేపట్టేందుకు కోదాడ పట్టణానికి చెందిన గుండపనేని సత్యనారాయణ జ్ఞాపకార్థం భార్య రమ, కుమారుడు నరేష్ రూ.20 వేలు, కేఎల్ఆర్ కాలనీకి చెందిన పుల్లకొండ సాంబశివరావు -నాగమణి దంపతులు రూ.5 వేలు విరాళంగా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో షిర్డీ సాయి భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా నారసింహుని నిత్యకల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని గురువారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీస్వామివారికి ప్రత్యేక అర్చనలు, హోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేపట్టారు. అనంతరం ఎదుర్కోళ్ల మహోత్సవం పూర్తిచేసి నిత్యకల్యాణం జరిపారు. తదనంతరం స్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ప్రవేశం అనంతరం మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

వంతెన లేక ప్రయాణానికి ఇక్కట్లు

- కోటయ్యగూడెం – జగన్నతండా గ్రామాల ప్రజలకు వాగు కష్టాలు
- వర్షాకాలంలో రాకపోకలు బంద్
- బ్రిడ్జి నిర్మించాలని వేడుకోలు


జగన్నతండా- కోటయ్యగూడెం గ్రామాల మధ్య వాగు

నేరేడుచర్ల : మండలంలోని కోటయ్యగూడెం గ్రామం నుంచి జగన్నతండాకు వెళ్లే మార్గంలో వాగుపై బ్రిడ్జి లేకపోవడంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం వస్తే రాకపోకలు నిలిచిపోయి అవస్థలు పడుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే వర్షాకాలంలో దిర్శించర్ల గ్రామంలోని చెరువు నుంచి, నర్సయ్యగూడెం చెరువు నుంచి నీరు వాగు గుండా ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. వర్షం వచ్చిందంటే ఈ వాగు పది అడుగులకు పైగానే ప్రవహిస్తుండడంతో వాగు దాటి వెళ్లడం కష్టం. దీంతో వానలొస్తే ఈ రెండు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. దీంతో వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, వివిధ పనులు నిమిత్తం వెళ్లే ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. దీంతో ప్రత్యామ్నాయ మార్గం గుండా దిర్శించర్ల, చిట్టెపువారిగూడెం, ముత్యాలమ్మకుంట గ్రామాల మీదుగా నేరేడుచర్లకు అతి కష్టంగా వెళ్తున్నామని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఎన్నికల సమయంలో వచ్చే నాయకులు బ్రిడ్జి నిర్మిస్తామని హామీ ఇస్తున్నారని, ఆ తర్వాత ఇటువైపు చూడడం లేదని ఆరోపిస్తున్నారు. వాగుపై వంతెన నిర్మించాలని అనేకసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వాగుపై వంతెనతో పాటు ఈ మార్గంలో రోడ్డు నిర్మించాలని వేడుకుంటున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



జగన్నతండా- కోటయ్యగూడెం గ్రామాల మధ్య వాగుపై వంతెన లేక ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నాం. ఈ విషయాన్ని గ్రామాలకు వచ్చే అధికారులు, ప్రజాప్రతినిధులు, మంత్రులకు తెలియజేసినా వారు పట్టించుకోవడం లేదు. రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో కనబడి వాగుపై వంతెన నిర్మిస్తామని చెబుతున్నారే తప్ప ఆచరణలో మాత్రం శూన్యంగా మారింది. ఇప్పటికైరా వాగుపై వంతెన నిర్మించి రెండు గ్రామాల ప్రజల ఇబ్బందులు తొలగించాలి.

– రమావత్ సైదా, జగన్నతండా

రజతోత్సవ సభను జయప్రదం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్


కోదాడరూరల్ : రజతోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మల్లయ్యయాదవ్, తదితరులు

కోదాడరూరల్ : వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించ తలపెట్టిన బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. గురువారం కోదాడ మండల పరిధిలోని గుడిబండలో పార్టీ మండల ముఖ్య నాయకులతో నిర్వహించిన సభ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సభకు నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో బీఆర్‌ఎస్ శ్రేణులు హాజరు కావాలని దిశానిర్దేశం చేశారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అనంతరం సభ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చింత కవితారాధారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి శెట్టి సురేష్, నాయకులు ముత్తవరపు రమేష్, గడిపూడి శ్రీకాంత్, బెల్లంకొండ బ్రహ్మం, దొంతగాని అప్పారావు, శ్రీనివాస్‌యాదవ్, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వరంగల్ సభ పోస్టర్ ఆవిష్కరణ

చిలుకూరు : వరంగల్‌లో ఈ నెల 27వ తేదీన నిర్వహించబోయే బీఆర్‌ఎస్ పార్టీ 25వ ఆవిర్భావ బహిరంగ సభకు పార్టీ నాయకులు, పార్టీ సానుభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ నాయకులు కోరారు. గురువారం చిలుకూరు బస్టాండ్ సెంటర్‌లో సభ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. చిలుకూరు పీఏసీఎస్ చైర్మన్ అలసకాని జనార్దన్, గ్రామ శాఖ కార్యదర్శి అల్లి ఉపేందర్, నాయకులు షేక్ పాషా, అమరగాని కాశయ్య, మాదారపు శ్రీను, అమరగాని లింగరాజు, సురగాని సైదులు, సిద్దెల పిచ్చయ్య, షకీర్, దొడ్డా శ్రీను, కోటేశ్వరరావు, సైదులు పాల్గొన్నారు.


చిలుకూరు : సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు

విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

కోదాడరూరల్ : న్యాయవాదుల రక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోదాడ బార్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సూర్యాపేటలో న్యాయవాది కిషోర్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ గురువారం కోదాడ కోర్టు ఆవరణలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. న్యాయవాదులపై దాడులకు పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కృష్ణమూర్తి, సుధాకర్‌రెడ్డి, కృష్ణయ్య, నాగేశ్వరరావు, యశ్వంత్, కరిముల్లా, హుస్సేన్, ధనలక్ష్మి, మురళి, నయీం తదితరులు ఉన్నారు.

కోనోకార్పస్ చెట్ల తొలగింపు

పాలకవీడు : ప్రజల్లో శ్వాస కోశ వ్యాధులకు కారణమవుతోన్న ప్రభుత్వం కోనోకార్పస్ చెట్ల తొలగింపు చేపట్టింది. గురువారం మండలంలోని కోమటికుంట గ్రామంలో గల పల్లె ప్రకృతి వనంలో కోనోకార్పస్ చెట్లను గ్రామపంచాయతీ అధికారులు తొలగించారు. తొలగించిన చెట్ల స్థానంలో మొక్కలు నాటించనున్నట్లు అధికారులు తెలిపారు.

ముందస్తుగా బడిబాట


రామాపురంలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ ఉపేందర్‌రావు

నడిగూడెం : బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని మండల విద్యాధికారి బి.ఉపేందర్‌రావు కోరారు. గురువారం నడిగూడెం మండల పరిధిలోని రామాపురం, చాకిరాల గ్రామాల్లో ముందస్తుగా బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు ఉన్నాయని, ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామదాసు, రాంబాబు, సుధాకర్, వీరబ్రహ్మం, శ్రీనివాసరావు, రమేష్, జానిభేగం, సీఆర్‌పీలు నందిగామ రామారావు, రాజుల గురుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ కొనుగోలు కేంద్రం ప్రారంభం


మునగాలలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ ఆంజనేయులు

మునగాల : ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమ శాతం వచ్చేలా ధాన్యాన్ని ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తహసీల్దార్ వలిగొండ ఆంజనేయులు రైతులకు సూచించారు. గురువారం మునగాల మండల కేంద్రంతో పాటు జాతీయ రహదారి పక్కన మొద్దులచెరువు స్టేజీ వద్ద మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరతో పాటు సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాసర్ల కోటేశ్వరరావు, ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, సామాజిక కార్యకర్త గంధం సైదులు, మండల వ్యవసాయ అధికారి బుంగా రాజు, ఏఈఓలు రమ్యతేజ, భవాని, నాగు, మాజీ వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు వేనేపల్లి వీరబాబు, కొమ్ము ఈదారావు, సుంకరి పిచ్చయ్య, నారాయణగూడెం మాజీ సర్పంచ్ జి.వెంకటరెడ్డి, ఐకేపీ నిర్వాహకులు కిన్నెర సామ్రాజ్యం, నాగరాణి, జయశ్రీ, అశ్విని, సైదులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

హుజూర్‌నగర్ : పట్టణంలోని పశువైద్యశాలలో గురువారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. దాదాపు 92 పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు అండగా సీపీఎం పోరాటం


మాట్లాడుతున్న నగేష్

నేరేడుచర్ల : ప్రపంచ కార్మికుల దినోత్సవం (మేడే) వేడుకల్లో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేష్ కోరారు. గురువారం నేరేడుచర్లలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన పార్టీ పట్టణ కమిటీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసంఘటిత రంగ కార్మికులకు అండగా రాజీలేని పోరాటాలు చేస్తోంది సీపీఎం మాత్రమేనని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. సీఐటీయూ మండల కన్వీనర్ నీలా రామ్మూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఎం నాయకులు కందగంట్ల అనంతప్రకాశ్, సరికొండ శ్రీను, రుద్రమ్మ, మీనయ్య, వెంకటేశ్వర్లు, వెంకన్న, సంపత్, హఫీజ్, ఏసు, శ్రీను తదితరులు ఉన్నారు.

సన్నబియ్యంతో సహపంక్తి భోజనం


సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో సహపంక్తి భోజనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మఠంపల్లి : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన సన్నబియ్యం లబ్ధిదారులు కొమ్ము బక్కయ్య- ఎల్లమ్మ దంపతుల ఇంట్లో గురువారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సన్నబియ్యంతో సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు బచ్చలకూరి బాబు, పీఏసీఎస్ చైర్మన్, వైస్‌చైర్మన్లు రామచంద్రయ్య, బాబునాయక్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు గంగసాని ఎల్లారెడ్డి, నాయకులు కిషోర్‌రెడ్డి, దైదా రాయలు, సింగారపు సైదులు, గురువయ్య, వీరబాబు, సక్రు, పిచ్చిరెడ్డి, నరసయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవాలు


మోతె : పోషకాహార పదార్థాలపై అవగాహన కల్పిస్తున్న టీచర్ పద్మ

నేరేడుచర్ల : పోషణ పక్షోత్సవాల్లో భాగంగా నేరేడుచర్ల మున్సిపాలిటీలోని అంగన్‌వాడీ కేంద్రం- 1, 2, 5లలో గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి పౌష్టిహాకారంపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి వారికి ఆకలి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఉపేంద్ర, పుష్ప, పద్మ, ఆశావర్కర్ గురువమ్మ తదితరులు ఉన్నారు.


నేరేడుచర్ల : పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి

మోతె : పోషణ పక్షోత్సవంలో భాగంగా మోతె మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం- 2లో గురువారం పోషకాహార పదార్థాలపై అంగన్‌వాడీ టీచర్ పద్మ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది సునిత, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మునగాల: మండల కేంద్రం శివారులోని వ్యవసాయ బావి సమీపంలో గురువారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తూముల వీరస్వామి వరిపొలంలో గుర్తుతెలియని 30ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వీరస్వామి వరికోత యంత్రం ద్వారా పొలం కోస్తుండగా పొలం మధ్యలో గుర్తు పట్టలేని స్థితిలో వ్యక్తి మృతదేహం పడి ఉంది. సమాచారం అందుకున్న మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి 30ఏళ్ల వయస్సు ఉంటుందని, జీన్ ప్యాంటు, టీషర్టు ధరించి ఉన్నాడని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నేడు విగ్రహాల ప్రతిష్టాపనోత్సవం

మునగాల : మండలంలోని నారాయణగూడెంలో నూతనంగా నిర్మించిన శ్రీకంఠమహేశ్వరస్వామి ఆలయం శుక్రవారం నిర్వహించే విగ్రహాల ప్రతిష్టాపనకు ముస్తాబైంది. గౌడ జెట్టి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు గ్రామ గౌడ సంఘం తెలిపింది. ఉదయం 11 గంటలకు శ్రీకంఠమహేశ్వరస్వామి, సురమాంబ దేవి, వనమైసమ్మ, వనఎల్లమ్మ, శివలింగం, నంది, కౌడిన్య మహర్షి, కలకోడిపుంజు, వినాయకుడు, పోతరాజుల విగ్రహాలు ప్రతిష్ఠించనున్నట్లు తెలిపింది. అదేవిధంగా మధ్యాహ్నం 12 గంటలకు తెలంగాణ తొలి బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం ఆవిష్కరించనున్నట్లు సభ్యులు తెలిపారు. ప్రతిష్టాపనోత్సవానికి పరిసర ప్రాంతాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా కాన్వొకేషన్ డే


సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

నేరేడుచర్ల : పట్టణంలోని శ్రీఅంజలి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో యూకేజీ పూర్తి చేసిన విద్యార్థులకు గురువారం కాన్వొకేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆకట్టుకున్నారు. అనంతరం యూకేజీ పూర్తి చేసిన విద్యార్థులకు స్కూల్ ప్రిన్సిపాల్ అలక సైదిరెడ్డి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాకుబ్, నాగప్రసాద్, ఆదినారాయణ, జనార్దన్, సతీష్, మహేందర్‌రెడ్డి, ఉపేందర్, వీరాంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, స్వప్న, నర్మద, మాధవి, నాగరాజు తదితరులు ఉన్నారు.

రామిరెడ్డికి సన్మానం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరుకు తనవంతు కృషి చేసిన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డిని కాంగ్రెస్ పట్టణ కమిటీ తరఫున అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్ గురువారం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన ఉండాలి


కోదాడ ఫైర్ స్టేషన్‌లో మొక్కలు నాటుతున్న మున్సిపల్ కమిషనర్, ఫైర్ అధికారి, సిబ్బంది

కోదాడరూరల్ : అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ రమాదేవి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం కోదాడ పట్టణంలోని బాలాజీనగర్‌లో గల ఫైర్ స్టేషన్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. ఇంట్లో వంట గ్యాస్ సిలిండర్లు లీకై జరిగే ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఫైర్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఫైర్ ఆఫీసర్ ముత్తినేని శ్రీనివాసరావు, వార్డెన్ జ్యోతి, సిబ్బంది విజయ్‌కుమార్, ప్రకాష్, శ్రీనివాస్, వీరబాబు, సత్యనారాయణ, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

అగ్ని ప్రమాదాలు, నివారణపై అవగాహన

హుజూర్‌నగర్ : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని పలు ఆస్పత్రుల్లో అగ్ని ప్రమాదాలు, నివారణ చర్యలపై అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. ఆస్పత్రుల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ఎలా నివారించాలో వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్ర సిబ్బంది డి.దేశ్యా, జి.నగేష్, నర్సింహారావు, ప్రశాంత్, వై.సైదులు, హాస్పిటల్ యాజమాన్యం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

మేళ్లచెరువు : అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని హుజూర్‌నగర్ ఫైర్ స్టేషన్ ఆఫీసర్ సుబ్బిరామిరెడ్డి అన్నారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా గురువారం మేళ్లచెరువు మండల కేంద్రం పరిధిలోని మైహోం సిమెంట్ పరిశ్రమలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించి అగ్నిప్రమాదాల నివారణపై కార్మికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పరిశ్రమ ఫైర్ అధికారి లక్ష్మయ్య, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.


హుజూర్‌నగర్ : అగ్నిప్రమాదంపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది


మేళ్లచెరువు : మైహోం పరిశ్రమలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నష్టపరిహారం పెంచాలి

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ (ఎంబీసీ) లిఫ్ట్ పైప్ లైన్ ఏర్పాటు చేస్తుండడంతో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం పెంచి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నందిరెడ్డి ఇంద్రారెడ్డి కోరారు. ఈమేరకు బాధిత రైతుల సమస్యలను బుధవారం రాత్రి హైదరాబాద్‌లో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి విన్నవించినట్లు తెలిపారు. మంత్రి వెంటనే రైతుల సమస్యలపై నీటిపారుదల సీఈ, కలెక్టర్లతో మాట్లాడినట్లు చెప్పారు. రైతులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

హోటల్‌కు జరిమానా

సూర్యాపేట అర్బన్ : దురాజ్‌పల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన హంగ్రీ బర్డ్స్ హోటల్‌లో బిర్యానీలో ఈగలు రావడంతో కస్తమర్ల జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌కు, మున్సిపాల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కస్టమర్ల ఫిర్యాదు మేరకు సంబంధిత అధికారులు గురువారం హంగ్రీ బర్డ్స్ హోటల్‌ను తనిఖీ చేసి హోటల్ యాజమాన్యానికి రూ.5000 జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ మస్కాపురం సురేష్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ సీహెచ్ శివప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద యువకుడికి క్యాన్సర్

- వైద్యానికి ఆర్థికస్థోమత లేక ఇంట్లో మంచానికే పరిమితమైన ప్రవీణ్
- రోజురోజుకూ క్షీణిస్తున్న ఆరోగ్యం
- కీమోథెరపీ చేయాలంటున్న డాక్టర్లు
- దాతల సాయం కోసం ఎదురుచూపులు


మంచానికే పరిమితమైన ప్రవీణ్

మునగాల : నిరుపేద కుటుంబానికి చెందిన యువకుడు క్యాన్సర్ వ్యాధి బారిన పడ్డాడు. చికిత్స చేయించుకునే స్థోమత లేకపోవడంతో ఇంటి వద్దనే మంచానికి పరిమితమై మృత్యువుతో పోరాడుతున్నాడు. కీమోథెరపీ చేయించుకోవడానికి చేతిలో చిల్లిగవ్వ కూడా లేకపోవడంతో దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నాడు. వివరాలు.. మునగాల మండలంలోని నారాయణగూడెం గ్రామానికి చెందిన సాల మరియమ్మకు ప్రవీణ్ (19), ప్రవళిక (16) ఇద్దరు సంతానం. గత కొన్నేళ్లుగా మరియమ్మ తన భర్తకు దూరంగా ఉంటూ కూలినాలీ చేసుకుంటూ పిల్లలతో ఉంటోంది. మరియమ్మకు కనీసం సెంటు భూమి, ఉండేందుకు సరియైన ఇల్లు కూడా లేదు. మరియమ్మ కుమారుడు ప్రవీణ్ 9వ తరగతి వరకు చదివి మునగాలలో మండల కేంద్రంలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ తల్లికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. కాగా రెండేళ్ల క్రితం ప్రవీణ్ క్యాన్సర్ వ్యాధి బారిన పడ్డాడు. దీంతో మరియమ్మ సుమారు రూ.3 లక్షలు అప్పు చేసి నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స చేయించింది. అయినా ప్రవీణ్ పూర్తిస్థాయిలో కోలుకోలేదు. ఇక చికిత్సకు డబ్బులు లేకపోవడంతో ప్రవీణ్‌ను ఇంటికి తీసుకొచ్చింది. ఇంటి వద్ద చికిత్స అందకపోవడంతో ప్రవీణ్ ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తోంది. తన కుమారుడు బతికి బట్టకట్టాలంటే కీమోథెరపీ చేయాలని వైద్యులు సూచించారని, కానీ అందుకు తనవద్ద సరిపడ డబ్బు లేవని దయార్థ్ర హృదయం కలిగిన దాతలు ఎవరైన ముందుకు వచ్చి చికిత్స కోసం ఆర్థికసాయం అందిస్తే తన కుమారుడి ప్రాణాలు దక్కుతాయని మరియమ్మ వేడుకుంటోంది.

నా కుమారుడి ప్రాణాలు కాపాడండి



క్యాన్సర్ బారిన పడిన నా కుమారుడు చికిత్స అందక మంచానికే పరిమితమై చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. చికిత్స చేయించే స్థోమత లేక ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నాం. దాతలు ముందుకు వచ్చి సాయం చేసి నా కుమారుడి ప్రాణాలు కాపాడండి.

– సాల మరియమ్మ, నారాయణగూడెం